6లో

వరంగల్ ఎంపీ పోటీ నుంచి విరమించుకున్న బిఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

2లో

ఇదేనా ఇందిరమ్మ పాలన?

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 90 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- శుక్రవారం 29 మార్చి 2024

తెలంగాణలో రసవత్తర రాజకీయం

- కాంగ్రెస్ గూటికి చేరనున్న మేయర్ విజయలక్ష్మి
- 30న ముహూర్తం ఖరారు అయినట్లు ప్రచారం
- విషయం తెలుసుకుని కెకెను పిలిచి మాట్లాడిన కెసిఆర్
- గట్టిగానే కేశవరావును మందలించినట్లు సమచారం

హైదరాబాద్,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలె రసవత్తర రాజకీయాలు నడుస్తున్నాయి. నగర మేయర్ విజయలక్ష్మి 30న కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ క్రమంలో ఆమె తండ్రి, ఎంపి కె కేశవరావు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే పార్టీ మారే ఉద్దేశం ఉన్నట్లు కెసిఆర్‌కు చెప్పడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కేకే వ్యవహరిస్తున్న తీరుపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నీ ఫ్యామిలీకి పార్టీ ఏం తక్కువ చేసింది. సాకులు చెప్పవద్దు. తగిన ప్రాధాన్యత ఇచ్చినా ఎందుకు పార్టీ మారుతున్నారు ' అంటూ ఆయన వద్దే అసహనం వ్యక్తం చేశారు. కేశవరావు వచ్చి కలిసిన సందర్భంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో

బండి సంజయ్‌పై కేసు నమోదు

- ఆంక్షలున్నా చెంగిచర్లకు వచ్చిన బండి
- పోలీసుల బారీకేడ్స్ తొలగించి బస్తీలోకి ఎంట్రీ
- ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్తత వాతవరణం
- బండితో పాటు మరో 9మందిపై కేసు నమోదు

హైదరాబాద్,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): చెంగిచర్ల – బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై కేసు నమోదైంది. ఈనెల 27న చెంగిచర్లలో జరిగిన ఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన బండి సంజయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు బండి సంజయ్‌తో పాటు మరో 9మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడ ఒక ఘటనలో గాయపడిన మహిళలను పరామర్శించేందుకు బండి సంజయ్ నిన్న చెంగిచర్లలోని పిట్టలబస్తీకి వెళ్లారు. బండి సంజయ్ రావడంతో పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు గుమిగూడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అనుమతి లేదంటూ తెలిపారు. ఎవరూ లోనికి అనుమతించకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాట్లు చేశారు.

వివరాలు 2లో

పరిశ్రమలొస్తేనే ఉపాధి అవకాశాలు

- త్వరలో సెగ్మెంట్‌కు సిమెంట్ ఫ్యాక్టరీ
- కొడంగల్ భూముల ధరకు కోకాపేటంత పెరగాలె
- పట్టాభూములకు మాదిరిగా అసైన్డ్ ల్యాండ్స్ కూ పరిహారం
- అద్దమోలె మెరువాలె.. ఆదర్శంగా నిలువాలె
- ముఖ్య నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): కొడంగల్ మరో కోకాపేట కావాలన్నదే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదర్శంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతానని ప్రకటించారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరగాలంటే రైతులు భూములు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో కొడంగల్ లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోకాపేటలో ఎకరం వంద కోట్లకు ఎందుకు పలికిందంటే అక్కడ అభివృద్ధి జరిగినందునే అన్నారు. కొడంగల్ లో భూముల ధరలు కూడా కోకాపేటంత పెరగాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, కొడంగల్ ను అద్దమోలె మెరిపిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా కొడంగల్ ను నిలుపుదామని అన్నారు. పట్టా భూములకు ఎంత పరిహారం ఇస్తామో.. అసైన్డ్ ల్యాండ్స్ కు కూడా అంతే ఇస్తామని, ఈ విషయాన్ని తాను అధికారులకు చెప్పినట్టు సీఎం తెలిపారు. కొడంగల్ లో అభివృద్ధి జరగకపోవడంతోనే ప్రజలు తాండూరు, రాయిచూర్, పరిగి, హైదరాబాద్, మహబూబ్ నగర్ కు పోతునారని, ఇక్కడ అభివృద్ధి చేసుకుంటే ఆ పట్టణాల వాళ్లే మన దగ్గరకు వస్తారని అన్నారు. తనను కొడంగల్ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, తాను రాకున్నా 33 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చి గెలిపించి అసెంబ్లీకి పంపారని, ముఖ్యమంత్రిని అయి వచ్చానని అన్నారు. మనకు వచ్చిన అవకాశాన్ని ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిద్దామని చెప్పారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకునీళ్లు ఇచ్చుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. కొడంగల్‌ను అద్దమోలె మెరిసేలా తీర్చిదిద్దుదామని అన్నారు.

న్యాయవాదుల లేఖ వెనక కాంగ్రెస్

- మండిపడ్డ ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): ఇతరులను వేధించడం, వారిపై కన్నెర్ర చేయడం కాంగ్రెస్ సంస్కృతి అని మోడీ విమర్శించారు. దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగు తున్నాయని ఆరోపిస్తూ 600 మందికి పైగా లాయర్లు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. రాజకీయ నేతలకు సంబంధించిన కేసుల్లో కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని స్వార్థమూకలు ఒత్తిడి వ్యూహాలను అమలుచేస్తున్నాయని అందులో ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పంది స్తూ.. కాంగ్రెస్ వెనక ఉండి నడిపస్తోందిన మండిపడ్డారు. అయిదు దశాబ్దాల క్రితం వారే కేంద్రానికి కట్టుబడి ఉండే న్యాయ వ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. తమ స్వార్థ ప్రయో జనాల కోసం ఇతరుల నుంచి నిబద్ధతను కోరుకుంటారు. కానీ.. దేశం పై మాత్రం ఎటువంటి నిబద్ధతను చాటుకోరు. 140 కోట్ల మంది భారతీయులు వారిని ఎందుకు దూరం పెడుతున్నారో ఆశ్చర్యపోనవసరం లేదని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. రాజకీయ అజెండాతో స్వార్థ ప్రయోజనాలను ఆశించే కొన్ని గ్రూప్‌లు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొ చ్చేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు కీలక తీర్పులపై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయన్నారు. వ్యక్తిగత, రాజకీయ కార ణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అనుమతించ కూడదన్నారు. వాటిపై మౌనంగా ఉంటే.. హాని చేయాలనుకునేవారికి మరింత బలం ఇచ్చిన ట్లేనని అన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టును కోరుతున్నాం అని న్యాయవాదులు తమ లేఖలో కోరారు.

టిక్కెట్ రాకపోవడంతో ఎంపి మనస్తాపం

- ఆత్మహత్యాయత్నం...చికిత్స పొందుతూ మృతి

కోయంబత్తూర్,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): లోక్‌సభ ఎన్నికల ముందు తమిళనాడులో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈరోడ్ ఎంపీ, ఎండీఎంకే నేత గణెశిశమూర్తి (77) కన్నుమూశారు. ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో ఇటీవల ఆయన ఆత్మహత్యకు యత్నించాడు. కోయంబత్తూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకే కూటమిలో ఎండీఎంకే కు ఈరోడ్ స్థానం దక్కింది. అక్కడి నుంచి గణెశిశమూర్తి ఉదయించే సూర్యుడి (డీఎంకే) గుర్తుపైనే పోటీ చేసి విజయం సాధించారు.

వివరాలు 2లో

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

- రైతులు ఆగమైపోతున్నా పట్టింపులేదు - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

సిరిసిల్ల,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నింపడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

తెలంగాణలో రసవత్తర రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

కాగా ఈ భేటీ అనంతరం కేకే కూడా తీవ్ర అసహనంతో ఇంటికి వెళ్లిపోయారు. ఇక కేకే నివాసానికి మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఇంద్ర కరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. కేసీఆర్‌తో భేటీ అనంతరం కే కేశవరావు తన అసహనాన్ని మీడియాపై ప్రదర్శించారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌజ్ నుంచి తన నివాసానికి చేరుకున్న సమయంలో మీడియా ప్రతినిధులు విజువల్స్ తీస్తుండగా ప్రస్టేషన్‌కు గురయ్యారు. ఇంటివద్ద వీడియోలు తీస్తున్న ప్రతినిధులపైకి దురుసుగా దూసుకొచ్చారు. నన్ను వీడియో తీసుకోండి అంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. కాగా కేకే కూతురు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమైంది. 30న ఆమె పార్టీలో చేరబోతున్నట్టు క్లారిటీ వచ్చింది. కాగా కే కేశవ రావు కూడా హస్తం పార్టీ గూటికి చేరబోతున్నారంటూ ఊహాగానాలు వెలువడుతున్నాయి. పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికరమైన చర్చ కూడా జరగుతోంది. మరి కేకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. మరోవైపు కేకే కుమారుడు విప్లవ్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరబోనని ప్రకటన చేశారు.గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌తో కేకే భేటీ అయ్యారు. తమ పట్ల, తమ పార్టీ పట్ల కేకే వ్యవహరిస్తున్న తీరుపై ఈ సందర్భంగా కేసీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు దీపా దాస్ మున్షితో భేటీ అయ్యారు. దీంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితోపాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు పార్టీ వీడుతున్నట్లు ఓ వైపు ప్రచారం జరుగుతుండగా... మార్చి 30న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కేకే కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని మీడియాలో వైరల్ అవుతోంది. కేకే పార్టీ మార్పుపై సమాచారం అందుకున్న మాజీ సీఎం కేసీఆర్.. కేకేను ఫామ్ హౌస్‌కు పిలుపించుకొని తలంటినట్లు తెలుస్తోంది.

సిజెఐతో సిఎం రేవంత్ భేటీ

హైదరాబాద్,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని తాజ్‌ఫలక్‌నుమాలో సీజేఐతో భేటీ అయ్యారు. రాజేంద్రనగర్‌లో బుధవారం జరిగిన నూతన హైకోర్టు నిర్మాణానికి సీజేఐ డీవై చంద్రచూడ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీజేఐని సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా హైకోర్టు నిర్మాణం గురించి వారి మధ్య కాసేపు చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది.

టిక్కెట్ రాకపోవడంతో ఎంపి మనస్తాపం

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ప్రస్తుత ఎన్నికల్లో కూటమి సర్దుబాట్లలో భాగంగా ఎండీఎంకేకు తిరుచ్చి కేటాయించగా.. అక్కడి నుంచి దురైవైగోను పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గణెశిశమూర్తి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే మార్చి 24న ఉన్నట్టుండి ఆయన అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రిలో చేర్చారు. విషపూరిత ట్యాబ్లెట్లు మింగి ఎంపీ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆ తర్వాత పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన.. ఈ ఉదయం పరిస్థితి విషమించడంతో కన్నుమూసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. 1947 జూన్‌లో జన్మించిన గణెశిశమూర్తి.. 1993లో ఎండీఎంకే ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పార్టీలో ఉన్నారు. 1998లో తొలిసారిగా పళని లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి శాసనసభ సభ్యుడిగా వ్యవహరించిన ఆయన.. 2009లో ఈరోడ్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో ఓటమి పాలై, గత ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి దాదాపు 2లక్షల భారీ మెజార్టీతో మరోసారి విజయం సాధించారు. 2016లో పార్టీ కోశాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

కెసిఆర్‌ను వెన్నాడుతున్న కేసులు

- రాజకీయంగా కోలుకోలేని స్థితిలో పార్టీ

- పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే మనుగడ

హైదరాబాద్,మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్):అధికారం కోల్పోవడంతో కెసిఆర్ వెంట నడిచిన వారు ఒక్కొక్కరే వీడిపోతున్నారు. కెసిఆర్‌తో ఇంతకాలం ఉన్న బంధాన్ని వారు కేవలం అధికారంతో మాత్రమే ముడి పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కసీటు అయినా గెల్చుకుంటేనే బిఆర్ఎస్‌కు ప్రాణం ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న ప్రచారం సాగుతోంది. దీనికితోడు అవినీతి, అక్రమాల కేసుల, ఫోన్ ట్యాపింగ్ కేసుల ఉచ్చు తగులుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే పార్లమెంటులో విజయంతో మళ్లీ సర్దుకునే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కూడా ఇప్పుడు అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయకున్నా నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలగితే రాజకీయంగా నిలబడతారు. లేకుంటే రాజకీయ సునామిలో కొట్టుకుపోతారు. సెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నది. పదేండ్లు రాష్ట్రాన్నిఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాన్నర పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడంలో కేసీఆర్, నాటి టీఆరెస్ పాత్ర తక్కువేమీ కాదు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా రెండు

పర్యాయాలు అధికారంలో ఉన్నది. మూడోసారి అనూహ్యంగా పరాజయం పాలయ్యారు. తీవ్రమైన ఓటమి నుంచి ఆ పార్టీ కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్‌గా మారింది. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. తాజాగా కవిత అరెస్టు, జైలు ఆ పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయి. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకుచుట్టుకుంటోంది. ఇలాంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొననగ గోరుచుట్టుపై రోకటిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం ఇబ్బందిగా మారింది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆరెస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ మంత్రి కడియం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతోందని జోస్యాలు చెప్పడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ మాటలే బీఆరెస్‌కు ఇబ్బందిగా మారాయి. నైతికత అంశాన్ని పక్కకుపెడితే తమ ప్రభుత్వ రక్షణకు ఫిరాయింపులను ప్రోత్సహించక తప్పలేదంటూ గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. తాజాగా నాగేందర్‌ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయ కలవరానికి దారితీసింది. పలువురు సిట్టింగ్ ఎంపీలు కూడా పార్టీని వీడారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. . మెజార్టీ సిట్టింగ్ ఎంపీలు రెండు పార్టీల్లోకి జంప్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ పోరాటం చేస్తున్నారు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆరెస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ స్థానాలు సిట్టింగ్‌లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్ కుమార్‌కు అభ్యర్థికి కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాలు కొత్తవారిని బరిలో దింపారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో కనీస పోటీ లేదని పార్టీ వర్గాల్లోనే చర్చించుకోవడం గమనార్హం. ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలూ నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆరెస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్‌లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపోయారు. తనకు ప్రజాభిమానం ఇంకా మెండుగా ఉందని నిరూపించుకుంటే కొంతకాలం రాజకీయంగా నిలబడతారు. కానీ అక్రమాలు, ఆర్థిక కేసులు మాత్రం వదలవని గుర్తించాలి.

కేజ్రీవాల్‌కు మరో నాలుగు రోజుల కస్టడి

- ఏప్రిల్1న కోర్టు ముందు ప్రవేశ పెట్టాలని ఆదేశం

- దేశం ముందు ఆప్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం

- ఇదంతా రాజకీయ కుట్ర అన్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ,మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): దిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ ఈడీ కస్టడీని దిల్లీ న్యాయస్థానం మరో నాలుగు రోజుల పాటు పొడిగించింది. ఏప్రిల్ 1వరకు ఆయన్ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయం వెల్లడించింది. గతంలో విధించిన ఏడు రోజుల కస్టడీ గురువారంతో ముగియడంతో ఈడీ అధికారులు ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట హాజరుపరిచారు. మద్యం కేసులో కేజీవ్రాల్‌ను ఇంకా విచారించేందుకు మరో ఏడు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరగా.. నాలుగు రోజుల పాటు కస్టడీకి

అనుమతించారు. ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11గంటలకు తమ ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. కేజీవ్రాల్‌ను విచారించే సమయంలో ఐదు రోజులు స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశామని.. ఆయన దాటవేత సమాధానాలను చెబుతున్నారని ఈడీ ఆరోపించింది. డిజిటల్ పరికరాల పాస్‌వర్డ్‌లను ఆయన వెల్లడించలేదని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. అదే సమయంలో మరో ముగ్గురు వ్యక్తుల వాంగ్మూలాలను సైతం రికార్డు చేసినట్లు తెలిపింది. అంతకముందు కేజీవ్రాల్ స్వయంగా కోర్టులో తన వాదనలు వినిపించారు. ఈ కేసులో తన పేరును నలుగురు సాక్షులు మాత్రమే ప్రస్తావించారని.. ఒక సీఎంను అరెస్టు చేసేందుకు ఆ వాంగ్మూలాలే సరిపోతాయా? అని 'ఈడీ'ని ఉద్దేశించి ప్రశ్నించారు. దేశం ముందు 'ఆప్'ను ఓ అవినీతి పార్టీగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈడీ విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని ఈ సందర్భంగా కేజీవ్రాల్ అన్నారు. మార్చి 21న కేజీవ్రాల్‌ను 'ఈడీ' అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దిల్లీ మద్యం విధానం కేసు 'రాజకీయ కుట్ర' అని.. దీనికి ప్రజలే సమాధానం చెబుతారని సీఎం కేజీవ్రాల్ పేర్కొన్నారు. ఈడీ కస్టడీలో ఉన్న ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టులో నేడు హాజరుపరిచారు. కోర్టు ప్రాంగణంలోకి వెళ్తున్న సమయంలో అక్కడున్న విలేకరులతో ఆయన ఈవిధంగా వ్యాఖ్యానించారు.

బండి సంజయ్‌పై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

దీంతో అక్కడకు చేరుకున్న బండిసంజయ్, ప్రజలు, అభిమానులు పోలీసులు ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. బస్తీలో మోహరించిన పోలీసుల కంటే బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో రావడంతో వారు బారికేడ్లను బద్దలుకొట్టి కాలనీలోకి ప్రవేశించారు. ఈ ఘటనలో గాయపడిన మహిళలతో సంజయ్ మాట్లాడి, వారికి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు కబేళా నిర్వాహకులకు కక్ష కట్టి పేద గిరిజన మహిళలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు బస్తీకి వచ్చి మహిళలు, పిల్లలపై దాడి చేశారని, కాబట్టి మహిళలపై కాకుండా వారిపై కేసులు నమోదు చేయాలి' అని డిమాండ్ చేశారు.పోలీస్ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, అనుమతి లేకుండా బస్తీలోకి ప్రవేశించారనే కారణంతో బండిపై కేసు నమోదు చేశారు.

ఇదేనా ఇందిరమ్మ పాలన?

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): ఇందిరమ్మ పాలన అంటే మతోన్మాదాన్ని ప్రోత్సహించడం, అక్రమ అరెస్టులు, కేసులతో నోరు నొకడమా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చెంగిచెర్ల ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ నేతలను నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు. తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారని, ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హౌస్ అరెస్టు చేశారని, బాధితులపైనే కేసులు నమోదు చేశారని విమర్శించారు. చంగిచెర్లలో అక్రమ కబేలాను తొలగించాలని, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై మోపిన కేసులను ఉపసంహరించుకోవాలని, బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కవిత అరెస్టు అక్రమం

- రాజకీయ కుట్రతోనే విపక్ష నేతల అరెస్టు - త్వరలో తిరిగి సొంత గూటికి చేరబోతున్నా - బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు

హైదరాబాద్, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అక్రమమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పార్టీ అంతర్గత విషయాలు, సమకాలీన రాజకీయ అంశాలపై చర్చ జరిగినట్టు కేశవరావు భేటీ అనంతరం మీడియాతో చెప్పారు.ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలు, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడడం, లోక్‌సభ ఎన్నికలు, బీఆర్ఎస్ పరిస్థితిపై చర్చించినట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ కవిత, అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరేన్ వంటివారిని కేవలం రాజకీయ కుట్రతోనే అరెస్టు చేశారని ఆరోపించారు.ఇటీవల తనను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కలిశారని, తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆహ్వానించారని చెప్పారు. దీంతో 84 ఏండ్ల వయసులో తిరిగి సొంత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన తనకు కూడా కలిగిందని వెల్లడించారు.బీఆర్ఎస్‌లో తనకు సముచిత గౌరవం దక్కిందని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా తనను బాగా చూసుకున్నారని అన్నారు. తాను, తన కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నామ ని చెప్పారు. తన కుమారుడు విప్లవ్ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పాడని వెల్లడించారు.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: విప్లవ్‌కుమార్

బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని రాష్ట్ర టీయూఎఫ్ఐడీసీ మాజీ చైర్మన్ కే విప్లవ్‌కుమార్ తెలిపారు. తన తండ్రి కే కేశవరావు, తన సోదరి, మేయర్ విజయలక్ష్మి పార్టీ మార్పుతో తనకు ఎలాంటి సంబంధంలేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తమ కుటుంబ సభ్యులు పార్టీ మారినా తాను మాత్రం వారితో వెళ్లడం లేదన్నారు. బీఆర్ఎస్‌కు విధేయుడిగానే ఉంటానని పేర్కొన్నారు. తాను కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసిస్తున్నానని, ఆయన నాయకత్వంలోనే పనిచేస్తానని ప్రకటించారు. తమ కుటుంబసభ్యులు పార్టీ మారిన తర్వాత అన్ని విషయాలను చెబుతానని పేర్కొన్నారు.

జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కేంద్రం ప్రారంభించాలి

- సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పీసీడబ్ల్యూ న్యూస్): ఏప్రిల్ 1వ తేదీన జిల్లాలోని ప్రతి మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో యాసంగి 2023-24 సంవత్సరంలో ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, ధాన్యం కొనుగోళ్లను చేపట్టే మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు, ధాన్యంతరలించేందుకు సంబంధించిన లారీ ఓనర్ల సంఘం, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 1వ తేదీన జిల్లాలోని ప్రతి మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై శిక్షణ కార్యక్రమం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో అన్నిచోట్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సదుపాయం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల

వద్ద నీడ ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 146 దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. శుభ్రం చేసిన ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఏ రోజు రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అదేరోజు నమోదు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని అన్నారు. కల్లాల వద్దనే ధాన్యం ఆరబోసుకునే విధంగా రైతులకు తెలియజేయాలన్నారు. ధాన్యం లో తేమ శాతం లేకుండా చూసుకోవాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, డీఆర్డీవో నాగ పద్మజ, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి రవీందర్ సింగ్, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏసిఎస్ఓ నరసింహారావు, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో సిఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయడంపై రైస్ మిల్లుల యజమానులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. మిల్లర్లు రోజువారి లక్ష్యాన్ని పూర్తి చేస్తేనే నిర్దేశించిన గడువు వరకు సీఎంఆర్ ను పూర్తి చేయవచ్చునని అన్నారు. సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని పెండింగ్లో లేకుండా చూసుకోవాలని మిల్లర్లకు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల యజమానులను నిర్దేశిత సీఎంఆర్ కెపాసిటీ, దానిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని వివరాలను జిల్లా కలెక్టర్ రైస్ మిల్లుల యజమానులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఎఫ్. సీ. ఐ. వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎస్ఓ వసంతలక్ష్మి, డిఎం మహేందర్, ఏసీఎస్ఓ కే వై ఎల్ నరసింహారావు, సివిల్ సప్లై డీటీలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రామకృష్ణకు ఎంపి టికెట్ కేటాయించాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవుల అసోసియేషన్

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపు నుండి డాక్టర్ పేరుమండ్ల రామకృష్ణ కు వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని ఉమ్మడి జిల్లా క్రైస్తవ సంఘ నేతలు కోరారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్ మీడియా సమావేశంలో ట్రైసిటి క్రిస్టియన్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవ అసోసియేషన్స్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ట్రై సిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ పాస్టర్ ఐజాక్ ఉపాధ్యక్షులు రెవరెండ్ పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ ఉమ్మడి వరంగల్ జిల్లా ట్రైసిటి క్రిస్టియన్ ఫెలోషిప్, ఆల్ క్రిస్టియన్ అసోసియేషన్స్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కు వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని ఏఐసీసీ పెద్దలు సోనియా గాంధీ, మల్లికార్జున కర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు సురేఖ, సీతక్క,

ఎమ్మెల్యే లను కోరారు . వరంగల్ పార్లమెంట్ పరిధిలో మూడున్నర లక్షల ఓట్లు దళిత క్రైస్తవులవి వున్నాయి . రామకృష్ణ కు టికెట్ ఇస్తే అందరం సహకారం చేస్తామన్నారు. పెరుమాండ్ల రామకృష్ణ పేదల డాక్టర్ గా విద్యావంతుడిగా వరంగల్ వాసిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతి గ్రామం ప్రతి పట్టణం లో జరుగుతున్న గత ప్రభుత్వంలో అక్రమాల మీద గత ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజలకు చేరువలో ఉండి ప్రజల కష్టసుఖాలను తెలిసిన వ్యక్తిగా రామకృష్ణ బడుగు బలహీన వర్గాల అందుబాటులో ఉంటూ ప్రజల గురించి పరితపించే వ్యక్తిగా హైదరాబాదులోని గల గవర్నమెంట్ హాస్పిటల్ లో ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ వరంగల్లో కీలక పాత్ర పోషించారు. శాసనసభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో క్రైస్తవులందరినీ ఏకతాటి మీది తీసుకువచ్చి వరంగల్ ఎమ్మెల్యేల గెలుపులో తనవంతు బాధ్యతగా కష్టపడ్డారని, ఇలాంటి నాయకుడికి టికెట్ ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవులు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రై సిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ డా. దామేర ఐజాక్, ఉపాధ్యక్షులు రెవరెండ్ డా. ఎం జోసఫ్ ప్రభాకర్, ఇంచార్జ్ సెక్రటరీ సువర్ణ రాజ్, జాయింట్ సెక్రెటరీ ఎం.వి లాజరెస్ (సి బి సి), జాయింట్ సెక్రెటరీ తాళ్ల పెళ్లి ప్రసంగి గారు, ఈసీ మెంబర్ రెవరెండ్ యూ. డేవిడ్, ఈసీ మెంబర్ పాస్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులకు పోలింగ్ నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు క్షుణ్ణంగా తెలియజేయాలి

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పీసీడబ్ల్యూ న్యూస్): ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని నియమ నిబంధనలను గురించి మాస్టర్ ట్రైనర్లు క్షుణ్ణంగా తెలియజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ జరిగే రోజున ప్రిసైడింగ్ , అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతలు కీలకం కనుక మాక్ పోల్ మొదలుకొని పోలింగ్ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండే విధంగా శిక్షణ కార్యక్రమాలలో మాస్టర్ ట్రైనర్లు

తెలియజేయాలన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ స్థానం పరిధిలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు హనుమకొండలోని చైతన్య డిగ్రీ కళాశాలలో మార్చి 31, ఏప్రిల్ 1, 2 తేదీల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాల నియోజకవర్గానికి సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఏప్రిల్ 1, 2 తేదీల్లో పరకాల లోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలైన వరంగల్ పశ్చిమ,పరకాలలో కొన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించినట్లు తెలిపారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రెండు నియోజకవర్గాలలోని అన్నీ పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ రోజున వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 దరఖాస్తు పత్రంతోపాటు ఓటరు గుర్తింపు (ఎపిక్)కార్డు జిరాక్స్ ను జతపరచాలని తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణలో అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనల గురించి మాస్టర్ ట్రైనర్లకు భాస్కర్ రెడ్డి, తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వై.వి. గణేష్ , హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ నారాయణ, డిఇఓ డాక్టర్ అబ్దుల్ హై, మాస్టర్ ట్రైనర్లు సుధాకర్ రెడ్డి , కుమార్, నరేందర్ రెడ్డి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎల్ వెంకటనారాయణ గౌడ్

తొర్రూర్, మార్చ్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండల కేంద్రంలోని గుర్తురు గ్రామానికి చెందిన ఎల్ వెంకట్ నారాయణ గౌడ్ టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోయాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్రెడ్డికి కాంగ్రెస్ కార్యాలయంలో పుష్ప గుచాన్ని అందజేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి అందులోనే అనేక పదవులను సంపాదించుకొని మంచి పేరు సంపాదించారు. టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్కి రావడంతో ఆయన రాకను జీర్ణించుకోలేకపోతున్నారు కొందరు ఎన్నికల ముందు నుండి కాంగ్రెస్ పార్టీ జెండాలను మోసిన కార్యకర్తలు మొదటి నుండి పార్టీలో నిద్ర ఆహారాలు లేక కష్టించి పని చేశామని అలాంటి వారికి పదవులు ఇవ్వక నూతనంగా వచ్చిన వారికి పదవులు అప్పగిస్తే పార్టీ మనుగడగ కోల్పోతుందని అలాంటి విషయం జరుగుతే కొందరు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర పార్టీలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు నేడు శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు హన్మకొండ జక్రియా ఫంక్షన్ హాల్లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్టు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉంటారని, అల్లా అందరిని చల్లగా చూడాలని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ప్రతి సంవత్సరం సొంతంగా ఇఫ్తార్ పార్టీ ని ఏర్పాటు చేయడం చాల సంతోషకరంగా ఉందని, కావున పార్టీలకు అతీతంగా ముస్లిం సోదరులు, మత పెద్దలు ఇఫ్తార్ పార్టీ లో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఆపదలో ఆదుకునే మానవతావాది: కౌన్సిలర్ పూర్ణ చారి

పరకాల, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): పరకాల పట్టణనికి చెందిన తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి ఎక్కడ ఆపద ఉంటే.. అక్కడ నేనున్నాను.. అంటూ ముందుకు వచ్చే మానవతావాది పూర్ణ చారి, ఇటీవల పరకాల పట్టణం లో ని10వ వార్డు మాదారం కాలనీకి చెందిన సూదమల్ల స్వప్న, 20 వార్డుకు చెందిన బండారు కన్నయ్య మృతిచెందిగా, ఈ విషయం తెలుసుకొని గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారికి బియ్యంతో పాటు ఆర్థిక సాయం చేసి తన ఔదార్యాన్ని, మానవీయ కోణాన్ని చాటుకున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకునే ఆపద్బాంధవుడు పూర్ణాచారి అని పట్టణవాసులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వంతో ప్రతి మనిషిని ప్రేమించాలి. ఒకరికి మీరు సాయం చేస్తే, వారు కూడా మరొకరికి సహాయం చేయాలని ఆలోచన వస్తుంది. అప్పుడే మనము, మన రాష్ట్రం, మన దేశము బాగుంటుందని ఆయన అన్నారు.

డోర్నకల్ రాజకీయాల పట్ల అవగాహన లేని జ్వాల పత్రిక

- ప్రతిపక్షానికి తొత్తుగా మారి ...

- డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచందర్ నాయక్

- మీద బురద జల్లడం .. కడు హేయమైన చర్య ...

- మరిపెడ కాంగ్రెస్ యువ నాయకుడు విజయ్ కుమార్

మరిపెడ, మార్చి 28,(పిసిడబ్ల్యూ న్యూస్): అక్రమ ఇసుక రవాణాకు ఒప్పుకోలేదనే అక్కసును ఇలా పత్రికల్లో వార్తల పేరిట వెళ్లగక్కడం సరైన చర్య కాదు అని మరిపెడ మండలం కాంగ్రెస్ యువ నాయకుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో గ్రాంపంచాయితీల్లో పది కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే పట్ల ఇలాంటి వార్తలు రావడం విచారకరం ...ఎన్నడూ ప్రజా సమస్యల పట్ల పోరాటం చేయని జ్వాల పత్రిక నేడు ఎమ్మెల్యే మీద బురద జల్లే పద్ధతి మానుకుంటేనే పత్రికా విలువలకు అర్థం వారు చేసిన అభివృద్ధి మీకు కనపడదు ..స్వయంగా ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమం క్రిస్మస్ బహుమతుల పంపిణీ ..కళ్యాణ లక్ష్మి .. షాధి ముభారాఖ్ చెక్కుల పంపిణీ లో మరిపెడ మండలానికి సంబంధించిన ప్రజా ప్రతినిధులు ఎవరు కూడా పాల్గొన లేదు అట్టి విషయాన్ని సదరు జ్వాల పత్రిక ఎందుకు ప్రశ్నించలేదు .. మళ్ళీ ఇలాంటి తప్పుడు వార్తలు రాసి ప్రజల్లో స్థానం కోల్పోతే ఆ జ్వాల పత్రికకు కూడా నష్టమే అని పత్రికలు పార్టీ కోసం కాదు సామాన్యుల సమస్యల కోసం పని చేయాలి అని మరిపెడ కాంగ్రెస్ యువ నాయకుడు విజయ్ కుమార్ అన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన తుడి లచ్చన్న

గంగాధర,మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కోల కనుకవ్వ మరణించిన విషయం తెలుసుకున్న అధినేత తూడి లచ్చన్న గారు టీ ఎల్ యువసేన సభ్యుల ద్వారా 5000/- మరియు 25 కేజీ ల బియ్యంను ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో యువసేన సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు లచ్చాన్నకు మరియు సభ్యులకీ కృతజ్ఞతలు తెలిపారు.

పలు వివాహ వేడుకలకు హాజరైన రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు

గంగాధర, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): వెలిచాల గ్రామానికి చెందిన పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ,రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు,మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్ రావు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో పలు వివాహాలకు హాజరై నూతన వధువువరులను ఆశీర్వదించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం , పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు చింతకింది విజయరమణారావు , మానకొండూరు నియోజకవర్గ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

- జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్

మరిపెడ, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): నేటి యువత స్వయం ఉపాధి మార్గాల పై దృష్టి సారించాలనీ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కాంప్లెక్స్‌లో మండలంలోని వీరారం గ్రామానికి చెందిన మామిడాల మునేష్ అనే యువకుడు 'సాగర్ మెన్స్ బ్యూటీ పార్లర్ అండ్ హెయిర్ స్టైల్' షాపును మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబుతో కలిసి నవీన్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసంఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేలోత్ హరినాయక్, బీఆర్ఎస్ నాయక్ లు అజ్మీరా హరి నాయక్, జర్పుల కాలు నాయక్, బొల్లం నర్సయ్య,దిగజర్ల శ్రీను, ముఖేష్, గంధసిరి కృష్ణ, గుండగాని సుందర్, చంద్రయ్య, మహిపాల్ ,మామిడాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ కొత్తగూడ ప్రధాన కార్యదర్శిల ఎంపిక

నర్సంపేట, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): స్థానిక కొత్తగూడ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు యాదగిరి మురళి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల ప్రధాన కార్యదర్శిలుగా తోటకూరి మధు, బోనాల ప్రవీణ్ చారి లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వారు మాట్లాడుతూ సిద్ధాంతాన్ని నమ్ముకున్న వ్యక్తులకు పట్టంకట్టడం జరిగిందని భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసే దిశగా పనిచేస్తామని అన్నారు. కేంద్రంలో జేపీ నడ్డా నాయకత్వంలో మూడవసారి భారతీయ జనతా పార్టీని గెలిపించే దిశగా, నరేంద్ర మోడీ ని మూడవ సారి ప్రధానమంత్రి అయ్యేందుకు తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు తమ ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వజ్జరవి, జాడి సారయ్య, వాసం సారయ్య, బొడ నవీన్ నాయక్, బిక్షపతి, రుప్లా, పరుషరాం, రవీందర్‌లు పాల్గొన్నారు.

బయ్యారంలో గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

- నాటు సారా కాసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం: సీఐ రవి కుమార్

బయ్యారం,28(పిసిడబ్ల్యూ న్యూస్): మండలంలో యదేచ్ఛగా నాటు సారా బట్టీలు పెడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బయ్యారం మండలంలోని కోయగూడెం గ్రామపంచాయతీ లోని చుంచు బంధం తండాలో గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. అక్రమ బెల్లం,సారా బట్టీలను ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా సీఐ రవి కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్లం రవాణా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, గుడుంబా కాసే వారి పై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, నాటు సారా కాసే వారి పై పి.డి యాక్ట్ అమలు చేస్తామని అన్నారు.ఈ దాడుల్లో ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్ బయ్యారం సీఐ రవికుమార్ లతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని గ్రామంలో గుడుంబా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నిరాధారణమైన ఆరోపణలు గుర్తింపు లేని పత్రికపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గ్రామ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న

మహబూబాబాద్, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):డోర్నకల్ నియోజకవర్గంలోని రాజకీయాల పట్ల అవగాహన లేని పత్రిక ..ప్రతిపక్షానికి తొత్తుగా మారి డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచందర్ నాయక్ మీద బురద జల్లడం హేయమైన చర్య ...అక్రమ ఇసుక రవాణాకు ఒప్పుకోలేదనే అక్కసును ఇలా పత్రికల్లో వార్తల పేరిట వెళ్లగక్కడం సరైన చర్య కాదు.ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో గ్రామ పంచాయితీల్లో పది కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఎంఎల్ఎ పట్ల ఇలాంటి వార్తలు రావడం విచారకరం ...ఎన్నడూ ప్రజా సమస్యల పట్ల పోరాటం చేయని పత్రిక నేడు ఎమ్మెల్యే మీద బురద జల్లే పద్ధతి మానుకుంటేనే పత్రికా విలువలకు అర్థం వారు చేసిన అభివృద్ధి మీకు కనపడదు.స్వయంగా ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమం(క్రిస్మస్ బహుమతుల పంపిణీ కళ్యాణ లక్ష్మి , షాధి ముభారాఖ్ చెక్కుల పంపిణీ)లో మరిపెడ మండలానికి సంబంధించిన ప్రజా ప్రతినిధులు ఎవరు కూడా పాల్గొనలేదు. అట్టి విషయాన్ని సదరు పత్రిక ఎందుకు ప్రశ్నించలేదు. మళ్ళీ ఇలాంటి తప్పుడు వార్తలు రాసి ప్రజల్లో స్థానం కోల్పోతే ఆ పత్రికకు కూడా నష్టమే ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ సామాన్య కార్యకర్త ఫోన్ చేసిన స్వీకరించే స్వభావం వారిది, నిరాదరణమైన ఆరోపణలు చేసిన గుర్తింపు లేని పత్రికపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

శ్రీరామ్ సాగర్ నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 28,(పీసీడబ్ల్యూ న్యూస్): కొడకండ్ల మండల కేంద్రంలో గురువారం పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మావిడాల యశస్విని రెడ్డి పర్యటించారు. మండల కేంద్ర శివారులో ఆక్యతండ వద్ద ఉన్న కెనాల్ నీటి ప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. అందుబాటులో ఉన్న రైతులతో వారు మాట్లాడుతూ ఎస్సారెస్పీ రెండో దశ కెనాల్ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలను వినియోగించుకుంటున్న తీరు ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు 1700 క్యూసెక్కుల నీటిని ప్రభుత్వం విడుదల చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు .ఆయా నీటితో 1,69,000 ఎకరాల పంటలు గోదావరి జలాలు అందుతాయని రైతులకు విన్నవించారు. రైతుల విషయంలో రాజకీయం చేయడం సరైంది కాదు ప్రతిపక్షాలు రాజకీయం చేయటం తగదని రైతుల విషయంలో ఆరోపణ అనవసర చేయకుడదన్నారు .గోదావరి జలాలను ఉపయోగించుకునే రైతులు ఆనందంతో ఉన్నారని పేర్కొంటూ రైతులు ఎప్పుడు సుఖ సంతోషాలతో ఉన్నప్పుడే అందరికీ ఆనందం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల ,దేవరుప్పుల మండల పార్టీ అధ్యక్షులు ,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ,కొడకండ్ల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మెయిన్ రోడ్లపై వైన్ షాపులు...

- ప్రయాణికులకు బాటసారిలకు ఇబ్బందులు

రామడుగు, మార్చి28(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండలంలోని వెదిర మండల కేంద్రమైన రామడుగు లో ప్రధాన రహదారిపైనే వైన్ షాపులు వెలవడంతో అటుగా ప్రయాణం చేసే ప్రయాణికులకు బాటసారులకు మహిళలకు చాలా ఇబ్బందులు కలుగుతుంది. వివరాల మేరకు రామడుగు ఎక్స్ రోడ్డు వద్ద వెధిర లో ఏర్పాటుచేసిన వైన్ షాపు ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో మద్యం ప్రియులు మందు కొనుగోలు కోసమై సేవించడం కై విచ్చేసినటువంటి వారు వారి వెంట తీసుకువచ్చిన వాహనాలను ప్రధాన రోడ్ల పక్కనే పార్కింగ్ చేయడం అటువైపుగా వెళుతున్నటువంటి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా మండల కేంద్రంలోని వైన్ షాప్ ఊరికి దగ్గరలో ఉండడం ప్రతి మంగళవారం అంగడి జరుగుతుండగా అటువైపుగా వస్తున్నటువంటి మహిళలకు మద్యం ప్రియులు బహిరంగ మూత్ర విసర్జనలు చేస్తూ కనబడడం చాలా ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికార యంత్రం దృష్టి పెట్టితగు చర్యలు చేపడితే బావుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎస్ ఆర్ స్పోకెన్ ఇంగ్లీష్ అకాడమీ ఇనిస్టిట్యూట్ కార్యాలయాన్ని ప్రారంభించిన 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్

ఖమ్మం, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):ఖమ్మం నగరంలో 23వ డివిజన్ పరిధిలో మిషన్ హాస్పిటల్ ఎదురుగా ఎస్ ఆర్ స్పోకెన్ ఇంగ్లీష్ అకాడమీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయడం జరిగింది . ఈ ఇన్స్టిట్యూట్ ను డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ గచేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది . తెలుగు ద్వారా ఇంగ్లీష్ చదవడం , వ్రాయడం , మాట్లాడటం , బేసిక్స్ నుండి నేర్పించబడును అని , 8వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ మరియు మ్యాథ్స్ , ఫిజిక్స్ క్లాసెస్ చెప్పబడును అని , అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఇంగ్లీష్ క్లాసెస్ (గ్రూప్స్ , టెట్ , డి.ఎస్.సి) , 9 నుండి 15 సంవత్సరాల పిల్లలకు సమ్మర్ స్పెషల్ క్లాసెస్ లో భాగంగా మెమోరీ టెక్నిక్స్ , స్పీడ్ రీడింగ్ టెక్నిక్స్ , మ్యాథ్స్ క్లాసెస్ నిర్వహించబడును అని ఇన్స్టిట్యూట్ మేనేజ్ మెంట్ నిర్వకులు కొలనుపాక శ్రీనివాసరావు (ఎం.ఏ , ఎం.ఇడి) , కొలనుపాక రమాదేవి మరియు డైరెక్టర్ కొత్తపల్లి సంధ్యారాణి ఎం.ఏ (ఇంగ్లీష్ లైటరేచర్) తెలిపారు . కావున ప్రతి ఒక్క విద్యార్థి , విద్యార్థిని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో మాథ్స్ ట్యూటర్ బి.రమాదేవి , జీ.వి.వి.ఎల్ నర్సింహా రావు , బండారు శ్రీనివాసరావు , తిరుమల శెట్టి జయ ప్రకాష్ , పరమేశ్వర రావు , బబ్బులు , లాలా , అక్బర్ , ఉమ్మనేని రాంబాబు , దాసరి నాగేశ్వరరావు , దాసరి శివ , మురళి , తాజుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్

ఇల్లందు, 28(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆదేశాల మేరకు జరిగిన ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భూక్య రవికుమార్ నాయక్ 25 ఓట్లతో తన సమీప ప్రత్యర్థి అయిన పెద్దూర్ నరసయ్య పై 6 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మూడవ ప్రత్యర్థి అయిన పులేటి ఆకయ్య కి 3 ఓట్లు పోలయ్యాయి. అనంతరం భూక్య రవికుమార్ మాట్లాడుతూ తనకు ఇంతటి విజయాన్ని అందించిన గౌరవ సీనియర్ న్యాయవాదులను, జూనియర్ న్యాయవాదులను,మహిళా న్యాయ వాదులను, అందరిని కలుపుకు పోయి బార్ మరియు బెంచ్ కి అనుసంధాన కర్తగా పనిచేస్తూ న్యాయవాదులకు ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా అడుగులు వేస్తానని తెలిపినారు. గెలుపొందిన సందర్భంగా తక్షణమే న్యాయవాదులకు మరుగుదొడ్ల నిర్మాణం మరియు మోటార్ వెహికల్ వాహనాల నిలుపుదలకు షెడ్ నిర్మాణం తక్షణమే ఏర్పాటు చేస్తానని తెలిపినారు. ఇల్లందు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా కాంపెల్లి ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కీర్తి కార్తీక్,ట్రెజరర్ గా సి.హెచ్ నవీన్ కుమార్ ఎన్నికైనారు.వీరి ఎన్నికను ఎన్నికల అధికారాన్ని మామిడి సత్య ప్రకాష్ అధికారికంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునరావు, చెన్నకేశవరావు, నర్సింగ్ శ్రీనివాస్, పప్పుల కరుణాకర్, దంతాల ఆనంద్, సుంకర బోయిన సత్యనారాయణ, పి బాలకృష్ణ, టీ .ప్రభాకర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

కావ్య హాస్పిటల్స్ ఖమ్మంలో అత్యాధునిక వైద్య సేవలు

ఖమ్మం, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): కావ్య హాస్పిటల్స్ లో జనరల్ మెడిసిన్ , డయాబెటాలజీ , ఎండోక్రినాలజీ , క్రిటికల్ కేర్ వైద్య సేవలు – 24/7 వైద్య సేవలు ఉభయ ఖమ్మం జిల్లాలకు అత్యాధునిక వైద్యం తక్కువ ధరలకు అందిస్తోంది. వాటి తో పాతుగా కొత్తగ హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ నుండి వైద్యులు డా.వెంకటేష్ బొల్లినేని– వాస్కులర్ మరియు ఎండోవాస్కులర్ సర్జన్ ఖమ్మంలోనీ కావ్య హాస్పిటల్స్ లో ప్రతి 1వ మరియు 3వ మంగళవారం అందుబాటులో ఉంటారు. హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ ప్రముఖ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్ డాక్టర్.సుభాకర్ నాదెళ్ల ప్రతి నెల 2వ బుధవారం కావ్య హాస్పిటల్స్ ఖమ్మంలో అందుబాటులో ఉంటారు అని కావ్య హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్. కావ్యచంద్ యలమూడి , చైర్మెన్ రవీందర్ యలమూడి , ప్రసూన పారుపల్లి తేలిపారు .



బిఆర్ఎస్ పార్టీ నుండి బీజేపీలో చేరికలు

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జాఫర్ ఫుడ్ మండలం వడ్డేగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నుండి పలువురు మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు కొరుకొప్పుల నగేష్ గౌడ్ అధ్వర్యంలో గురువారం బీజేపీ పార్టీలో చేరారు. వీరికి బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా నాకు ఈ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజానీకానికి సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు నా గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ కార్యకర్తలను నన్ను నమ్ముకున్న అందరినీ కంటికి రెప్పలా

కాపాడుకుంటానని, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు వెళ్ళి ఘనమైన విజయాన్ని సాధిస్తామని అన్నారు. ఘనపూర్ నియోజకవర్గం నుండి బీజేపీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రణాలికలు సిద్ధం చేసుకోనీ ముందుకు వెళ్లాలని నాయకులను కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో బొడ్డు అశ్విని, విజయ, రాణి, రంగమ్మ, అంబిక, రేణుక, శోభ,పద్మ,శాంత,రాజు తదితరులు చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి గౌడ్,మాజి మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శులు రమేష్, రాజు,దళిత మోర్చ మండల అధ్యక్షులు శ్రీను,మండల ఉపాధ్యక్షులు అరవింద్, ఓబిసి మండల మోర్చ శ్రీనివాస్ గౌడ్, బీజెవైఎం మాజి మండల అధ్యక్షులు లోకేష్ గౌడ్,సోషల్ మీడియా గణేష్ గౌడ్, గీతా సెల్ కన్వీనర్ రామరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ ఒకటవ తేదీ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్

ములుగు జిల్లా, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ములుగు జిల్లాలో ఏప్రిల్ ఒకటవ తేదీ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ మహేందర్ జి అన్నారు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు పై శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు హమాలీ కార్మికులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని ముఖ్యంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున సమృద్ధిగా తాగునీరు అందించాలని తెలిపారు రైతులు కష్టపడి శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసి డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని అన్నారు గ్రేడ్ ఏ రకం వరి ధాన్యానికి ప్రభుత్వం 2,203

రూపాయలు సాధారణ రకం వరి ధాన్యానికి 2,183 రూపాయల మద్దతు ధర తో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు ములుగు జిల్లా సమీప చత్తీస్గడ్ రాష్ట్రంతో సరిహద్దు ఉన్న నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని పోలీస్ అధికారుల సమన్వయంతో సివిల్ సప్లై అధికారులు అగ్రికల్చర్ అధికారులు ఇతర రాష్ట్రాలలో పండించిన ధాన్యాన్ని ములుగు జిల్లాలోకి ప్రవేశించకుండా తనిఖీలు నిర్వహించాలని అన్నారు అనంతరం సివిల్ సప్లై జిల్లా మేనేజర్ బి రాంపతి మాట్లాడుతూ యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అన్ని ఏర్పాట్లు

పూర్తి చేసినట్లు తెలిపారు వరి ధాన్యం కొనుగోలు చేసే సందర్భంలో ఎలక్ట్రిక్ కాంటాలు మాత్రమే ఉపయోగించాలని త్రికోణం కాంటాలను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని సూచించారు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున నియమ నిబంధనకు లోబడి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి శ్రీనివాస్ కుమార్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర డి సి ఓ సర్దార్ సింగ్ గిరిజన సహకార సంస్థ డిస్టిక్ మేనేజర్ ప్రతాపరెడ్డి మార్కెటింగ్ ఆఫీసర్ సుచరిత ఇతర సివిల్ సప్లై అధికారులు అగ్రికల్చర్ అధికారులు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు రైస్ మిల్లర్లు పిటిసి ఇన్చార్జిలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వాక్యాలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

హనుమకొండ ప్రతినిధి, మార్చి 28 (పీసీడబ్ల్యూ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటి ఆర్ ను అరెస్ట్ చేసి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ర్యాలీగా వచ్చి హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై గత మూడు రోజుల నుండి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు నిరసనగా, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఎస్.హెచ్.ఓ హన్మకొండ కేటీఆర్ ను అరెస్ట్ చేసి అతనికి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు.. మాట్లాడుతూ రూ.2500 కోట్ల రూపాయలు కాంట్రాక్టర్ దగ్గర బిల్డర్స్ దగ్గర వసూలు చేసి డిల్లికి పంపించాడని, లేని పోనీ అబద్దాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వ్యక్తిగతంగా మాట్లాడుతూ వారి యొక్క పరువు భాద్యతలకు కూడా భంగం కలిగించే విధంగా మాట్లాడడం శోచనీయమన్నారు. తెలంగాణా ముఖ్యమంత్రి లోక్ సభ ఎన్నికల తర్వాత భారతీయ జనతీయ పార్టీలోకి వెళ్తాడని, ముఖ్యమంత్రి స్థాయిని

తగ్గించే విధముగా మాట్లడుచు తెలంగాణ ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చే విధముగా మాట్లాడుతూ కేటీఆర్ వద్ద ఎటువంటి ఆధారాలు లేకున్నా తప్పుడు మాటలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నిరాదారమైన మాటలు మాట్లాడి వ్యక్తిగత పరువు ప్రతిష్టకు భంగం కలిగించినందున కల్వకుంట్ల తారక రామారావు పై కేసు నమోదు చేసి అతనిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి. కేటీఆర్ వ్యాఖ్యలు ఇలాగే కొనసాగితే వారి పార్టీ గుర్తింపు రద్దుకు ఎలక్షన్ కమీషన్ ను కలిసి పార్టీ గుర్తింపు రద్దును చేయాలని కోరుతామని పిసిసి సభులు బత్తిని శ్రీనివాస్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి ఈ.వి శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ- రజాలి, పోతుల శ్రీమాన్, సీనియర్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు తోట వెంకట రాజ్ కుమార్, లీగల్ సెల్ నాయకులూ తొగరు జగన్ మోహన్ రెడ్డి, రావుల శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు అలువల కార్తిక్ , జిల్లా ఎన్.ఎస్. యు ఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్, యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఎస్. కుమార్ యాదవ్, గాండ్ల స్రవంతి, మంద రాకేశ్, బంక రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది మన మున్సిపాలిటీ పనితీరు ? నంబర్ వన్

- ఆసుపత్రుల ముందే దుర్గంధాలు , ప్రజలకు రోగాలు రావని ఎలా చెబుతారు

తొర్రూరు, మార్చి 28,(పీసీడబ్ల్యూ న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం, పట్టణాన్ని దుర్గంధం నుంచి కాపాడుకుందాం. పట్టణ వాసులకు చక్కని గాలి మంచి వాతావరణాన్ని కల్పిద్దామని ఇదే కాకుండా మీ ఇంటిలోని చెత్తను పరిసరాలలో కానీ మురికి కాలువలో వేయకుండా చూడండి ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామంటూ ప్రతినిత్యం వీధి వీధి నా పట్నం మొత్తం మైకు ద్వారా ప్రచారం చేస్తుంటారు మున్సిపాలిటీ అధికారులు. చెప్పటానికి చెప్తారు

ఆచరణలోకి వచ్చేసరికి అన్ని వదిలేస్తారని పట్టణ వాసులు ఆగ్రహం చేస్తున్నారు. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అభివృద్ధి పనుల కోసం గతంలో ఎన్నో నిధులు వెచ్చించినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పట్టణం మొత్తం ఈగలు, దోమలు , విహారం చేస్తున్న మనకెందుకులే అని వదిలేస్తున్న అధికారుల తీరుడు ఏమనాలో తెలియక నోరు మూసుకోవాల్సి వస్తుందని గృహ యజమానులు ఎవరికీ చెప్పుకోలేని బాధలను అనుభవిస్తున్నామని అంటున్నారు .ఇంటి పన్నులు మాత్రం ఒకరోజు ఆలస్యమైతే పట్టు పట్టి డబ్బులు వసూలు చేస్తుంటారు. గతంలో వ్యాపారస్తుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్ల నిషేధం అంటూ వాటిని మానయకపోతే దుకాణాలను సేల్ చేస్తామన్న అధికారులే వ్యాపారస్ల వద్ద యదేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న అవేవీ పట్టించుకోవటం లేదు. పట్టణంలోని రెండు ప్రధాన ఆసుపత్రుల ముందే దుర్గంధ భరితమైన వాతావరణంతో చెత్తాచెదారం వేస్తూ స్థానిక గృహాల వారికి ఇబ్బందులు కలుగుతున్న శుభ్రం చేయని సిబ్బంది మందలించకుండా వదిలేస్తున్న తీరుపై ప్రజలు నిమ్మకుడి పోయారు. ప్రధాన రహదారి నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వెళ్లే దారిలో ఉన్న ఆస్పత్రిముందే చెత్తాచెదార మ్ వేసి ఆ ప్రాంత వాసులకు అనారోగ్య పాలు చేస్తున్నారని మండి పడుతున్నారు. ఇదే కాకుండా అన్నారం వైపు వెళ్తున్న మరో ప్రధాన ఆసుపత్రి ఎదురుగా మురికి కాలువలు లేక మీరు అక్కడే నిలిచి భయంకర వాతావరణంతో రోగాలను తెచ్చిపెడుతుందని వాటి బారిన పడి జేబులు కాలీ చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని పట్టణ మున్సిపాలిటీ అధికారుల తీరు ఎలా ఉందో గమనించండి అంటున్నారు . ఎవరైనా తప్పు చేస్తే తప్పులు ఎత్తిచూపుతారు వీరు చేసే తప్పులను ఎవరు పట్టించుకుంటారు అంటున్నారు. ఇప్పటికైనా దుర్గంగా భరిత వాతావరణ నుండి ప్రజలను కాపాడాలని పట్టణ వాసులు వేడుకుంటున్నారు . శాసనసభ ఎన్నికల సమయంలో పట్టణంలోని అన్ని కౌన్సిలర్ వార్డుల్లో కంకర పోసి వదిలేసారని రాత్రి వేళలో పాఠశాలలో ద్విచక్ర వాహనదారులు కింద పడిపోతున్నారని స్థానిక శాసన సభ్యురాలుతో మాట్లాడి రోడ్డు పనుల నిర్మాణం పూర్తి చేసే విధంగా చూడాలని పేర్కొంటున్నారు .మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ లోని దుర్గంధ భరిత వాతావరణం ఇలా ఉంది.

నిరుపేద కుటుంబానికి నిత్య అవసరాల సరుకుల పంపిణీ

రామడుగు, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండల కేంద్రంలో ఇటీవల మరణించిన జంగ బుజ్జమ్మ కుటుంబానికి ప్రఘాడ సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోమ్మరవెని తిరుపతి ముదిరాజ్ ఆధ్వర్యంలో బుజ్జమ్మ కుటుంబానికి 25 కేజీల బియ్యం, వంటనూనె నిత్య అవసరాల సరుకులు ను ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి. పంజాల శ్రీనివాస్ గౌడ్. రామడుగు ఉపసర్పంచ్. వడ్లూరి రాజేందర్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీలం చిన్న ముదిరాజ్. పొన్నం సత్తయ్య. కాంపల్లి రాజు. తదితరులు పాల్గొన్నారు.

డెబిట్ కార్డు చార్జీలను పెంచిన ఎస్బిఐ

తొర్రూర్, మార్చి 28,(పిసిడబ్ల్యూ న్యూస్): దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బిఐ) కస్టమర్లకు షాక్ ఇచ్చింది తమ డెబిట్ కార్డుల వార్షిక నిర్వహణ చార్జీలను పెంచేసింది బ్యాంకు వెబ్సైట్ ప్రకారం ఎస్బిఐ డెబిట్ కార్డులపై వార్షిక నిర్వహణ చార్జీలను రూపాయలు 75 కు పెంచింది దీనికి జీఎస్టీ అదనంగా ఉంటుందని అన్నారు పెరిగిన చార్జీలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు.

తప్పుడు కథనాలు సరికాదు

- రాంచంద్రునాయక్ పాలనలో బూత్ స్థాయి కార్యకర్తకు ప్రాధాన్యం - గెలిచిన నాటి నుంచే గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం - మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి

మరిపెడ, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ అంటేనే పేదల పక్షపాతి అని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కాంగ్రెస్ పాటుపడుతోందని, నేడు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాలనలో బూత్ స్థాయి కార్యకర్తకు కూడా పనులు ఇవ్వటం జరిగిందని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి అన్నారు. ప్రజల కోసం అహర్నిషలు పని చేస్తున్న ఎమ్మెల్యే పై తప్పుడు కథనాలు రాయటం సరికాదని, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారన్న అక్కసుతో ఇలా రాయిస్తున్నారని ఎమ్మెల్యేపై వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. గురువారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తప్పుడు కథనాన్ని ఖండించారు. కాంగ్రెస్ గెలిచిన నాటి నుంచే ప్రజా పాలనపై దృష్టి సారించిందని, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు వేయిస్తూ అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. అదే విధంగా పార్టీలోని అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసి వారిని నిలువరిస్తున్న క్రమంలో ఆయనపై కొందరు కావాలని తప్పుడు వార్తలు రాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పాలనలో భాగంగా రాత్రింబవళ్లు ఆయన ప్రతి మండలం సందర్శిస్తూ అధికారులతో రివ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా ప్రతినిధిపై అవాస్తవాలు, సత్యదూరమైన ఆరోపణలు చేయటం హేయనీయమని, ఆయన పరువుకు భంగం, కాంగ్రెస్ పాలనపై అసత్య ఆరోపణలు చేస్తూ కథనం రాసిన వారిపై చట్ట రీత్యా, న్యాయ శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ శాతం అత్యధికంగా నమోదయ్యేలా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ

పెద్దపల్లి జిల్లా, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు.గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఉన్న 3 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 7 లక్షల 15 వేల 735 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్క ఓటరు ఎన్నికలలో తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోనేలా ఓటు ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్లను చైతన్యపరిచేందుకు, ఓటింగ్ శాతం పెరిగేలా, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గత ఎన్నికలలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ లు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసి వారి ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించాలని, ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించే విధంగా కరపత్రాలను పంపిణీ చేయాలని, గ్రామంలోని మహిళలంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని, మహిళా సంఘాలచే ర్యాలీల ద్వారా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఆశా వర్కర్లు, ఏఎన్ఎం ల ద్వారా ఓటు ప్రాముఖ్యతను వివరించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సబ్ సెంటర్లలో ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించే విధంగా గోడ ప్రతులను ప్రదర్శించాలని, సెక్స్ వర్కర్లంతా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ సీనియర్ సిటిజన్లు అంతా తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోఉన్న వృద్ధాశ్రమాలు, దివ్యాంగుల సంస్థలలో ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైతే ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని వివరించాలని అన్నారు. రామగుండంలో ఉన్న సింగరేణి మైనింగ్ ఏరియా, ఎన్టిపిసి, కేశోరం ఫ్యాక్టరీ, ఆర్.ఎఫ్.సి.ఎల్ మొదలగు సంస్థల వద్ద పనిచేసే కార్మికుల కోసం ప్రత్యేక ఓటర్ నమోదు, ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు హనుమా నాయక్, బి. గంగయ్య, జెడ్పీ సి.ఈ.ఓ. నరేందర్, డి.ఆర్.డి.ఓ. రవీందర్, డి.పి.ఓ. ఆశాలత, డిఈఓ- డి.మాధవి, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్, డి.ఎం.అండ్ హెచ్ఓ డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన, పరిశ్రమలశాఖ జిఎం మధుసూదనా చారీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న

సుల్తానాబాద్, మార్చి28(పిసిడబ్ల్యూ న్యూస్): మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న మాట్లాడుతూ పిల్లల సంరక్షణ చట్టాలు, పొక్సో చట్టం, హెల్ప్ లైన్ నంబర్లు, సఖి కేంద్రం సేవలు, పోష్ చట్టం, పి.సి. -పి.ఎన్.డి చట్టం, ఇతరులతో ఎలా వ్యవహరించాలి, గుడ్, బ్యాడ్ టచ్ ల గురించి విద్యార్థులకు వివరించారు. పోషకాహారం తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలనీ, అలాగే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం గురించి అవగాహన కల్పించామని అన్నారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ లేదా పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసినవారికి, చేయించుకున్నవారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ,10 వేల రూపాయలు జరిమాన విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వైద్య శాఖ అధికారులు అడపిల్లలకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఋతు క్రమం, పోషక విలువలను వివరిస్తూ, పిల్లల ఎదుగుదలలో వచ్చే శారీరక మార్పులు గురించి అవగాహన పెంచుకొని ఆందోళనలను తగ్గించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయ రావు, వైద్యాధికారులు డాక్టర్ అనుదీప్, డాక్టర్ సంతోష్, డాక్టర్ స్వప్న, డిపిహెచ్.ఎన్.ఓ. డోరుకమ్మ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ మున్సిపల్‌ను స్వచ్ఛ మున్సిపల్‌గా తీర్చిదిద్దాలి

- చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు

సుల్తానాబాద్, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): నిత్యం వార్డు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు పేర్కొన్నారు.గురువారం మున్సిపల్ పరిధిలోని 07వార్డు యాదవ్ నగర్‌లో పరిసరాల పరిశుభ్రతలు పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ వార్డు ప్రజలు కాలనీలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని కాలనీలు శుభ్రంగా ఉంటే ఎలాంటి రుగ్మతలు దరిచేరవని ప్రతి ఒక్కరూ విధిగా తడి పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్ వాహనం తో వచ్చిన సిబ్బందికి అందించాలని, కాలువలలో చెత్త చెదారం వేయవద్దని ప్లాస్టిక్ గాజు సీసాలు ఇతరత్రా నిలువ చేసి సిబ్బందికి అందించాలని కవర్లు ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని వాటి ద్వారా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకుంటే తద్వారా మున్సిపల్ పూర్తిగా స్వచ్ఛ మున్సిపల్ గా మారుతుందని రోడ్ల పై ఇంటి చుట్టుపక్కల ఎలాంటి పిచ్చి మొక్కలు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే దోమలు ఈగలు దరిచేరకుండా పరిశుభ్రంగా గృహాలు ఉంటాయని అన్నారు. విధిగా ప్రతి ఒక్కరు సహకరించి సుల్తానాబాద్ మున్సిపల్ ను స్వచ్ఛ మున్సిపల్ గా మార్చేందుకు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య సిబ్బందిచే పేరుకుపోయిన మురికి కాలువలను శుభ్రం చేయించారు. అనంతరం ప్రతి ఇల్లు ఇల్లు తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడు కౌన్సిలర్ కూకట్ల గోపి, సానిటరీ జవాన్లు, రాజకుమార్, ఆనంద్ లతోపాటు కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

మెదక్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా నీలం మధును ప్రకటించడం పట్ల హర్షం

- నీలం మధకు ఎంపి టికెట్ కేటాయించిన సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

- ముదిరాజ్ మరిపెడ యువజన నాయకుడు సాయి ముదిరాజ్

మరిపెడ, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): మరిపెడ మెదక్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా నీలం మధును ప్రకటించడం పట్ల మరిపెడ మండల ముదిరాజ్ యువజన నాయకులు సాయి ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయి మాట్లాడుతూ మెదక్ ఎంపి అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ ను ప్రకటించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిసి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు మెదక్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. పేదల సంక్షేమ రాజ్యం అందించాలని కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఇందుకోసమే గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. మెదక్ ఎంపిగా నీలం మధు అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్ ముదిరాజ్, వెంకట్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, సాయి ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, వీరన్న ముదిరాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ప్రతిష్ట మహోత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దంపతులు

పెద్దపల్లి జిల్లా, మార్చి 28(పిసిడబ్ల్యూ న్యూస్): ఈరోజు పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీకట్టమైసమ్మ తల్లి, సుబ్రహ్మణ్యస్వామి (జంట నాగులు) దేవాలయ మూర్తి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు దంపతులకు ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, శాలువాలతో సత్కరించి అమ్మవారి ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, యువకులు,మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పడాల శ్రీరాములు..

సుల్తానాబాద్, మార్చి28 (పిసిడబ్ల్యూ న్యూస్): సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో 43 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగంచుకున్నారు. అధ్యక్ష స్థానానికి ఆలూరి శ్రీనివాసరావు, పడాల శ్రీరాములు పోటీపడగా పడాల శ్రీరాములు కు 29 ఓట్లతో అధ్యక్షుడు గా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శి పదవికి బోయిని భూమయ్య, జోగుల రమేష్, వేపూరి తిరుపతి లు పోటీ పడగా జోగుల రమేష్ 23 ఓట్లతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పెగడ శ్యాం సుందర్, సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవికిరణ్, లైబ్రరీ కార్యదర్శిగా అవుల శివ కృష్ణ, మహిళా ప్రతినిధి గా పి. సంధ్యారాణి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీరాజం, బాలకిషన్ ప్రసాద్, పబ్బతి లక్ష్మీకాంత్ రెడ్డి, అకారపు సరొత్తంరెడ్డి, వోడ్నాల రవీందర్, అవునూరి సత్యనారాయణ,జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మల్యాల కరుణాకర్, తాళ్ళపల్లి లక్ష్మణ్, అరెల్లి రాములు, వంగల యుగంధర్ రెడ్డి, బొబ్బిలి శ్యాం, గుడ్ల వెంకటేష్ లను ఎన్నుకున్నారు. పడాల అంజయ్య, రుద్రారపు నర్సయ్య ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు.

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న బెల్టు షాపుల దందా.. పట్టించుకోని అధికారులు..

చిట్యాల, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం.. చిట్యాల... చల్లగారిగె... మొగుళ్లపల్లి ..ఈ ప్రాంతంలో ఉన్నటువంటి వైన్ షాపులు విచ్చలవిడిగా బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. బెల్టు షాపుల దగ్గర వైన్స్ షాపుల యజమాన్యం అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. యజమాన్యం విచ్చలవిడిగా వారికి ఇష్టమొచ్చిన రేట్లకు అమ్ముతున్నారు వీరి..దందా ప్రజల పైన అదనపు భారం పడుతుంది. గ్రామాలలో బెల్ట్ షాపుల దగ్గరికి వెళితే అధిక ధరలకు అమ్ముకుంటున్నారు ఏ ఊరికి చూసినా ఏడు ఎనిమిది బెల్ట్ షాపుల దందా కొనసాగుతోంది.ఎన్నికల కోడ్ నిబంధనలో ఉన్న వీరి.. దందా మాత్రం కొనసాగుతూనే ఉంది ఈ దందాను పట్టించుకున్న నాధుడే లేడు అటు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు.ఎక్సైజ్ అధికారులు ఇటు స్థానిక పోలీసులు ఏ మాత్రం కూడా పట్టించుకోవడం లేదు బెల్ట్ షాపుల దందాను అరికడదాం చెప్పినరాష్ట్ర ప్రభుత్వం అమలుకు మాత్రం నోచుకోవడం లేదు తక్షణమే ఈ దందాను అరికట్టి వైన్స్ షాపుల యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొని బెల్ట్ షాపుల దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నావ్ అన్నారు నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

వరంగల్ ఎంపీ పోటీ నుంచి విరమించుకున్న బిఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య

వరంగల్, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బిఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య ఒక ప్రకటనలో తెలిపారు.మే 13, 2024 నాడు జరిగే లోకసభ ఎన్నికలలో వరంగల్ లోకసభ స్థానం నుండి భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన మీకు ధన్యవాదములు. అయితే గత కొన్ని రోజులుగా పార్టీ నాయకత్వంపై మీడియాలో వస్తున్న అవినీతి, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్ లాంటి వ్యవహారాలు, లిక్కర్ స్కాం లాంటి విషయాలు పార్టీ ప్రతిష్టను దిగజార్చాయి. జిల్లాలోని నాయకుల మధ్య సమన్వయం, సహకారం లేకపోవడం, ఎవరికీ వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించడం పార్టీకి మరింత నష్టం చేస్తున్నందున,ఈ పరిస్థితులలో నేను పోటీ నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నాను. కె.సి.ఆర్, పార్టీ నాయకత్వం, బిఆర్ఎస్ కార్యకర్తలు నన్ను మన్నించ వలసిందిగా కోరుతున్నాను.